క్లుప్తంగా

పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలి

మద్దిపాడు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేడు ఒంగోలుకు రోడ్డుమార్గంలో వస్తున్న సందర్భంగా జిల్లా ముఖ ద్వారమైన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద బాలినేనికి స్వాగతం పలకడానికి భారీగా ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఒక ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఆయన జిల్లాలోకి ప్రవేశిస్తారని ఆయనకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా పోస్ట్ మాస్టర్‌కు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న పోస్ట్‌మాస్టర్‌కు వీడ్కోలు పలుకుతున్న పోస్టాఫీస్ సిబ్బంది

చీమకుర్తి: చీమకుర్తి పోస్టాఫీస్‌లో పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న కిరణ్‌బాబు బదిలీపై బాపట్ల వెళ్తున్న సందర్భంగా ఆదివారం చీమకుర్తి పోస్టాఫీస్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీపై చీమకుర్తి పోస్టాఫీస్‌కు వచ్చిన పోస్ట్ మాస్టర్ రామారావు, స్థానిక సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మూడేళ్లుగా కిరణ్‌బాబు చీమకుర్తి పోస్టాఫీస్ పరిధిలో అందించిన సేవలను కొనియాడారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులందుకున్న క్రికెట్ విజేతలు

చీమకుర్తి: సంక్రాంతి పండుగ సందర్భంగా సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి బహుమతిని బూరేపల్లి టీమ్, రెండో బహుమతిని మైనంపాడు ఎఫ్‌సీసీ టీమ్ గెలుచుకుంది. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.20 వేలను గొడుగు మస్తాన్ అండ్ సన్స్, ద్వితీయ బహుమతి రూ.15 వేలను కిలారి శ్రీను బ్రదర్స్ విజేత జట్లకు అందించారు.

గవర్నర్‌కు లా పుస్తకం అందజేసిన విద్యార్థి



గవర్నర్‌కు లా పుస్తకాన్ని అందజేస్తున్న సుఖేష్

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ విదేశీ విద్యా దీవెన పథకం కింద అమెరికాలో విస్కాన్సిన్ యూనివర్శిటీ ఆఫ్ లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న అద్దంకి కాకానిపాలెంకు చెందిన విద్యార్థి సందిరెడ్డి సుఖేష్ ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌కు విస్కాన్సిన్ లా పుస్తకాన్ని, గవర్నర్ ప్యాలెస్ నమూనాను అందజేశారు.

రిక్షాను ఢీకొన్న ఆటో



క్షతగాత్రుడు బొజ్జా దేవయ్య

పామూరు: ఎదురుగా వస్తున్న రిక్షాను ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరు డీవీపాలెంకు చెందిన బొజ్జా దేవయ్య రిక్షా తోలుకుని జీవిస్తుండగా భోజనానంతరం డీవీపాలెం నుంచి తిరిగి పామూరులోకి రిక్షాపై వస్తుండగా పామూరు నుంచి దూబగుంట్లవైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రిక్షాను ఢీకొట్టడంతో రిక్షా తోలే దేవయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రున్ని వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో ఒంగోలు నియోజకవర్గంలో పటిష్టంగా విద్యుత్ వ్యవస్థ

- రూ.100 కోట్లకు పైగా వ్యయంతో నగరంలో హైటెన్షన్ వైర్లు అండర్ గ్రౌండ్‌కు..
- ఒంగోలు నగరంలో ఇండోర్ సబ్ స్టేషన్ ప్రారంభం
- పది తీరప్రాంత గ్రామాల్లో రూ.3 కోట్లతో నూతన విద్యుత్ లైన్లు
- దేవరంపాడు, కరవది, గుత్తికొండివారిపాలెం సబ్‌స్టేషన్లలో పూర్తి స్థాయిలో మరమ్మతులు
- ఇటీవల మిచాంగ్ తుఫాన్ సమయంలోనూ సజావుగా విద్యుత్ సరఫరా
- కరెంట్ కోతల బెడద తప్పడంతో ప్రజలతోపాటు రొయ్యలు, చేపల చెరువుల రైతుల హర్షం



చేజర్ల-కరవది మార్గంలో నూతన విద్యుత్ స్తంభాలు



ఉలిచి-ఒంగోలు మార్గంలో..

'లైన్' క్లియర్..!

ఒంగోలు రూరల్:

ఒంగోలు నగరంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన కృషి ఫలించింది. ఒంగోలు నగరంలో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల మీదుగా వెళ్తున్న హైటెన్షన్ వైర్లను తొలగిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని బాలినేని నిలబెట్టుకున్నారు. 132 కేవీ లైన్‌ను తొలగించి, అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ ఏర్పాటు చేసేందుకు వంద కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి పనులు పూర్తి చేయించారు. అదే సమయంలో రూరల్ గ్రామాల్లో



చేజర్లమ్మ గుడి వద్ద మినీ ట్రాన్స్‌ఫార్మర్



ఒంగోలులో అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న బాలినేని(ఫైల్)

నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల నాటి వ్యథ తీరింది..

తుఫాన్ సమయాల్లో చిగురుటాకులా వనికే తీర ప్రాంత గ్రామాల్లో.. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ఆ బాధ మాటల్లో చెప్పలేనిది. ఒంగోలు రూరల్ మండలంలోని చేజర్ల, పాసకాలపాలెం, కరవది, ఉలిచి, బొద్దులూరివారిపాలెం, గుండాయపాలెం, పాతపాడు, చింతాయగారిపాలెం, పెద్దదేవరంపాడు, చిన్న దేవరంపాడు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ఈ స్తంభాలు.. తుఫాన్, భీకరగాలుల ధాటికి నేలకూలుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించినా సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభించలేదు. పొలాల్లోకి భారీగా చేరిన వరద నీరు బయటకు వెళ్లేంత వరకు మరమ్మతులు చేపట్టడం కుదిరేది కాదు. అప్పటి వరకు గ్రామాలన్నీ గాఢాంధకారంలో ఉండిపోవాల్సిన దుస్థితి. ఆక్వా చెరువుల్లో విద్యుత్ మోటార్లు ఆగిపోవడం వల్ల రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ అందక మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో విద్యుత్ సమస్యపై అప్పటి విద్యుత్ ఏఈ ఆర్‌ఆర్ చెన్నారెడ్డి సమగ్ర నివేదికను ఎమ్మెల్యే బాలినేనికి అందజేశారు. దీంతో బాలినేని రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించి తీర ప్రాంత గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయించారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, ఏ క్షణాన తెగిపోతుందో తెలియని కండక్టర్, తుప్పుపట్టిన కాసారాలను పూర్తిగా తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.



సబ్‌స్టేషన్లలోనూ మరమ్మతులు

దేవరంపాడు, కరవది, గుత్తికొండవారిపాలెం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో నూతన కేబుల్స్ నిర్మించారు. పంట పొలాల మధ్యలో విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చారు. రహదారుల మీదుగా వెళ్లే విద్యుత్ తీగలను ఎక్కువ ఎత్తులో పటిష్టంగా ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో ఇటీవల మిచాంగ్ తుఫాన్ సమయంలోనూ విద్యుత్ సరఫరాకు పెద్దగా అంతరాయం కలగలేదు. ముందు జాగ్రత్తగా కొంతసేపు విద్యుత్‌ను నిలుపుదల చేయడం మినహా మిగిలిన సమయమంతా సజావుగా సరఫరా చేశారు. దశాబ్దాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేసిన బాలినేనికి ఒంగోలు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



ఫెన్సింగ్‌తో కూడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఈదుమూడిలో ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మండలంలోని ఈదుమూడి గ్రామంలో మనం-మన ఊరు- మన ఈదుమూడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కావూరి వాసు మాట్లాడుతూ అందరికీ వైద్యం అందించాలని మా సంస్థ ద్వారా ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం వైద్యులు జాస్మిన్, హరికృష్ణ, ప్రసాదు, ఏడుకొండలు ఇసీజీ, బీపీ, షుగర్, యూరిక్ యాసిడ్, నరాల స్పర్శ, వ్యాధులకు సంబంధించి మొత్తం 163 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ దాసరి సుధాకర్ యాదవ్, రవి, నాగరాజు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆదమరిస్తే అంతే సంగతులు



ఆదమరిస్తే అంతే సంగతులు

దొనకొండ: నూతన సంవత్సరంలో పంట పొలాలు కాపు రావటంతో కూలీలకు గిరాకీ పెరిగింది. గ్రామాల నుంచి కూలీలు విచ్చలవిడిగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆదమరిస్తే అంతే సంగతులు. పాఠశాలలకు సెలవులు రావటంతో చిన్నారులు కూడా తల్లిదండ్రుల వెంట కూలీ పనులకు వెళ్తున్నారు. ఆటోల్లో పైన కింద కూర్చుని కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రమాద సంఘటన జరిగితే అంతే సంగతులు.

వైభవంగా ధర్మ ప్రచార వారోత్సవాలు



ధర్మ ప్రచార రథంలో చెన్నకేశవ స్వామి, పాల్గొన్న అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కేశవస్వామిపేటలో ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు సనాతన ధర్మం, ఆలయాల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఆదివారం నుంచి వారం రోజులపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధర్మ ప్రచార రథ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ధర్మప్రచార రథాన్ని చైర్మన్, కార్యనిర్వహణ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఒంగోలులోని మామిడిపాలెం, సీతారామపురంలో సీతారామస్వామి దేవస్థానంలో అభిషేకం, గోపూజ, అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్తి గీతాలాపన జరిగింది. కార్యక్రమంలో అర్చక స్వాములు పి.రామనాథాచార్యులు, నాగార్జున దేవ్, శ్రీధర్, వి.కె.రాంబాబు చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనికుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదన్ మోహన్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మస్తాన్ ఔలియా గంధ మహోత్సవం



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఒంగోలు టౌన్: మతసామరస్యాన్ని చాటిచెబుతూ ఒంగోలు ట్రంకు రోడ్డులోని హజరత్ గోరే మస్తాన్ ఔలియా 45వ ఉరుసు గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని గోపాల్‌నగర్‌లో దివంగత పూరిమిట్ల కృష్ణ స్వగృహం నుంచి ఫకీర్ల నవరంగ్ మేళా వాయిద్యాలు, సాము ప్రదర్శనలతో జల్సా ఊరేగింపు నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణతో ప్రత్యేక వాహనంపై అమర్చిన పల్లకిలో హజరత సయ్యద్ గోరే మస్తాన్ గంధ మహోత్సవం ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల మధ్య అఖండ దీపారాధన, మిలాదే షరీఫ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించారు. హజరత్ బాబా పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మహోత్సవంలో ఫకీర్లు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి.

తీరంలో జూదం



తీరంలో జూద శిబిరం వద్ద హడావుడి

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపుపాలెం-రామాయపట్నం మధ్య ఉన్న తీరప్రాంతంలో ఆదివారం సందర్భంగా భారీగా కోడిపందేలు నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి కోడిపందెం వేయడానికి జూదరులు వచ్చారు. రామాయపట్నం, పెదపట్టపుపాలెంకు చెందిన కొందరు ఈ ఆట నిర్వహించినట్లు సమాచారం. ఆట జరుగుతున్న సమయంలో వివాదం కూడా జరిగిందని స్థానికులు తెలిపారు. గ్రామంలోని పెద్దలు ఈ కోడిపందెం నిర్వహణపై పోలీసులకు సమాచారం అందించారు. కానీ వివాదం జరిగిందని తెలియడంతో ఆటను నిలిపివేశారు. దాదాపు రూ.10 నుంచి రూ.30 లక్షల వరకు పందెం జరిగిందని సమాచారం. అయితే గొడవ జరగడంతో ఆటను నిలిపివేశారని, దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లలేదని సమాచారం. ప్రతి ఆదివారం తీరప్రాంతంలో జూదం భారీగా జరుగుతోందని స్థానికులు తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు



క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన కొత్తపట్నం జట్టు

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు ఆదివారంతో ముగిశాయి. గ్రామ స్థాయిలో ప్రతిభ చాటిన పురుషులు 174 మంది, మహిళలు 117 మంది మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో క్రికెట్ విజేతగా కొత్తపట్నం టీం, వాలీబాల్, ఖోఖో విజేతగా గమళ్లపాలెం, కబడ్డీ విజేతగా రాజుపాలెం, బ్యాడ్మింటన్ విన్నర్‌గా ఈతముక్కల, మహిళల విభాగంలో ఖోఖో విజేతగా గమళ్లపాలెం, వాలీబాల్ విన్నర్‌గా గమళ్లపాలెం, కబడ్డీలో కె.పల్లెపాలెం, బ్యాడ్మింటన్ కొత్తపట్నం, క్రికెట్‌లో కొత్తపట్నం జట్లు విజేతగా నిలిచాయి. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీలు తెలిపారు.

పౌరాణికానికి వన్నె తెచ్చింది 'చీమకుర్తి'



నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాంతారావు, కళాకారులు

అల్లూరు(కొత్తపట్నం): పౌరాణికానికి వన్నె తెచ్చింది చీమకుర్తి నాగేశ్వరరావు అని బండారు నాట్య మండలి అధ్యక్షుడు, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు కొనియాడారు. అల్లూరు గ్రామంలో ఆదివారం చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి సభను కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషంపాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రంలో పౌరాణిక రంగంలో అనేక కొత్త బాణీలతో పద్యాలను ఆలపించి ప్రేక్షక హృదయాలను ఆకట్టుకున్న మహానటుడు చీమకుర్తి నాగేశ్వరరావును కొనియాడారు. గ్రామీణ తీర ప్రాంతాల్లో ఆయన ఆలపించిన పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్బారావు, మెట్టా చైతన్య ప్రసాద్, కొండయ్య, రామారావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనపై ఆకర్షితులైన మండలంలోని కలవకూరు గ్రామంలోని 50 వడియరాజుల కుటుంబ సభ్యులు టీడీపీ పార్టీని వీడి ఆదివారం కోట వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవకూరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



అభిషేకానంతరం విశిష్ట పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ, నాయకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ రుత్వికులు మహంకాళి ప్రసాదుశర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి గర్భాలయాన్ని ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వరుస సెలవు దినాలు కావడంతో పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, జిలకర నారాయణ, మధుసూదన్, సుబ్బరాయుడు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.